క్లుప్తంగా

25న సాంస్కృతిక ప్రదర్శన

అలంపూర్: ఈ నెల 25వ తేదీన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రజా నాట్యమండలి జిల్లా గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అలీఅక్బర్, జిల్లా కార్యదర్శి ఆశన్నలు ఒక ప్రకటనలో తెలిపారు. అలంపూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బాల్యానికి చిరుప్రాయం నుంచే దేశభక్తి, సామాజిక దృక్పథం, శాంతి, సామరస్యం, భిన్నత్వం, వైవిధ్యాన్ని అస్వాదించటం అలవాటు చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశభక్తి, అభ్యుదయం పై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జీఓ 19ను రద్దు చేయాలి



కేటీదొడ్డి: జీఓ 19ను రద్దు చేసి బీసీ కురువ సామాజిక వర్గానికి చెందిన వారికి ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయొద్దని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మండల తహసీల్దార్ సరితారాణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



గద్వాల రూరల్: మెగాఫ్యాన్స్ సామాజిక సేవలో ముందుంటూ అందరికీ ఆదర్శంగా ఉంటారని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. మంగళవారం స్థానిక నల్లకుంటలోని వాల్మీకి భవన్‌లో మెగాఫ్యాన్స్ ఆధ్వర్యంలో 2024 సంవత్సర నూతన క్యాలెండర్‌ను మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ ఆవిష్కరించారు. జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5లక్షల బీమా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాబర్, కోటేష్, మెగాఫాన్స్ సంఘం నేతలు సిద్దు, రఘు, బషీర్, రవి, రంగస్వామి శ్యాం పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వాలని డీఎల్‌పీఓకు వినతి



గద్వాల అర్బన్: గ్రామ పంచాయతీ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకుడు మధు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఉన్న డబ్బును సర్పంచులు వారి సొంత పనులు ఇష్టమొచ్చినట్లుగా వాడుకోని వర్కర్లకు జీతాలు చెల్లించకపోవడం సిగ్గు చేటన్నారు. పెండింగ్‌లోని వేతనాలను వెంటనే చెల్లించాలని, లేదంటే కలెక్టర్ కార్యాలయానికి ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ ప్రధాన కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్, చంద్రాములు, నాగరాజు, రంగన్న, నర్సింహులు ఉన్నారు.

లెనిన్‌కు ఘన నివాళి



రాజోళి: రష్యా విప్లవనేత కామ్రేడ్ లెనిన్‌కు సీపీఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మండల కేంద్రంలో లెనిన్ శత వర్ధంతి సభను నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ రష్యాదేశంలో కార్మికుల కోసం, పీడిత వర్గాలు, అనగారిన కార్మికుల కోసం, రైతు పక్షాన నిలబడి లెనిన్ పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు తిక్కన్న, లక్ష్మన్న, నడిపన్న, మహేష్, చిన్నదస్తగిరి, విజయలక్ష్మి, లక్ష్మీదేవి, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పంటపొలాలకు దారి ఏర్పాటు చేయండి

అయిజ: భారతమాల ఆరు వరుసల రోడ్డు నిర్మాణం చేపట్టడంతో తూంకుంట, పర్దీపురం, జడిదొడ్డి, వెంకటాపురం శివార్లలో పంటపొలాలకు దారి లేకుండా పోయిందని పేర్కొన్నారు. బ్రిడ్జి ఏర్పాటు చేసి దారి మూసుకపోకుండా చూడాలని మంగళవారం మండలంలోని రైతులు జిల్లా కార్యాలయంలో దరఖాస్తు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు రైతులు ధనుంజ, ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

చెట్లకింద చదువు ఇంకెన్నాళ్లు?

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



బిజ్వారంలో చెట్టుకింద విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు

మల్దకల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో చేసేదేమీ లేక చెట్లకింద విద్యాభ్యాసం కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 'ఇంకెన్నాళ్లు చెట్లకింద చదువులు' అంటూ చిన్నారులు ఆవేదనకు గురవుతున్నారు. మల్దకల్, ధరూరు, గట్టు, గద్వాల, కేటీదొడ్డి మండలాల్లోని జిల్లా పరిషత్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా గదుల్లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సగానికి పైగా పాఠశాలలకు గదుల కొరత ఉండటంతో చెట్లకింద, వరండాలు, తాత్కాలిక రేకుల షెడ్లలో విద్యార్థులు కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది. మల్దకల్ మండలంలో మొత్తం 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 4 ఉన్నత, 27 ప్రాథమిక పాఠశాలలున్నాయి. వాటిలో మొత్తం 6,848 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారికి సరిపడా గదులు, వసతులు లేక మధ్యలోనే బడిమానేసి పొలంబాట పడుతున్నారు. ప్రభుత్వం విద్యను ప్రోత్సహించేందుకు ఓ పక్క చర్యలు తీసుకుంటున్నా.. మరో పక్క పాఠశాలల్లో మౌలిక వసతులు లేక గ్రామీణ విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. మల్దకల్ హైస్కూల్‌లో 746 మంది విద్యార్థులకు 12 తరగతి గదులున్నాయి. ఆ గదులు పైపెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థులను చెట్లకింద కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాలలో ఉన్న మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. ప్రహరీలు లేకపోవడంతో ఆవరణలన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి. బిజ్వారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 456 మంది విద్యార్థులకు గాను 10 తరగతి గదులున్నాయి. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థులను చెట్లకింద కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు సరిపడా మౌలిక వసతులు, తరగతి గదులను నిర్మించాలని కోరుతున్నారు.



మల్దకల్‌లో చెట్టుకింద చదువుతున్న విద్యార్థులు

రోజూ ఇబ్బంది పడుతున్నాం..



ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు లేక రోజూ ఇబ్బందులు పడుతున్నాం. పాఠశాలలో సరిపడా గదులు లేవు. చెట్లకింద చదువుకోవాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పరశురామ్, 10వ తరగతి, మల్దకల్

బడికి వెళ్లాలంటే భయంగా ఉంది



బడికి వెళ్లాలంటే భయంగా ఉంది. పాఠశాలల్లో సరిపడా గదులు లేక చెట్లకింద చదువుకుంటున్నాం. ఉన్న గదుల్లో పైకప్పు పెచ్చులూడి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ చదువుకుంటున్నాం.

– సోమేశ్వరి, 10వ తరగతి, బిజ్వారం

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



పాఠశాలల్లో నెలకొన్న గదులు కొరత, మౌలిక సదుపాయాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్న గదుల్లోనే సమస్యలు లేకుండా విద్యాభ్యాసం చేయిస్తున్నాం. సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

– కొండారెడ్డి, ఇన్‌చార్జి ఎంఈఓ, మల్దకల్

భద్రతా నియమాలు పాటించాలి



గద్వాలలో వాహనాదారులకు గులాబీ పూలను అందజేస్తున్న పోలీసులు

గద్వాల క్రైం: ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని పట్టణ, రూరల్ ఎస్‌ఐ శ్రీ కాంత్, ఆనంద్‌లు అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రధాన రోడ్డుమార్గాల్లో వాహనాల తని ఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులతో మాట్లాడారు. సీటుబెల్టు, హెల్మెట్, ఇన్స్‌రెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు సామర్థ్యం కలిగిన వారు మాత్రమే రోడ్డు ప్రయాణాలు చేయాలన్నారు. మ ద్యం, సెల్‌ఫోన్, నిద్రలేమీ కారణాలతో డ్రైవింగ్ చే యడం ద్వారా ప్రమాదాలకు దారి తీస్తాయన్నారు. వాహనాలు నడిపేవారికి వినూత్నంగా గులాబీ పూ లు అందజేశారు.

కేటిదొడ్డి: ద్విచక్ర వాహనదారులు భద్రతా నియమాలు పాటించాలని ఎస్‌ఐ వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలో వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలను వివరించి పుష్పాలు అందజేశారు.

శాంతినగర్: రోడ్డు భద్రత నియమాలు పాటిస్తున్న ప్రయాణికులకు పోలీసులు పువ్వులు అందజేసి ధన్యవాదాలు తెలిపారు. అలంపూర్–రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారిపై రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వెళ్తున్న ప్రయాణికులకు ఎస్‌ఐ నరేష్, హెడ్‌కానిస్టేబుల్ వెంకటస్వామిగౌడ్, కానిస్టేబుల్ ప్రకాశం, డ్రైవర్ మనోహర్‌లు పువ్వులు అందజేశారు.

ధరూరు: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి భద్రతా నియమాలు పాటించాలని ఎస్‌ఐ శివానందంగౌడ్ అన్నారు. రోడ్డు భద్రతావారోత్సవాల్లో భాగంగా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలను వివరించారు. హెల్మెట్ ధరించిన వారికి పుష్పాలు అందజేసి అభినందనలు తెలిపారు. సందర్భంగా వాహనదారులకు పుష్పాలను అందజేసి వారోత్సవాల ప్రాధాన్యతను తెలిపారు. కార్యక్రమంలో రేవులపల్లి పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



వాహనదారునికి పుష్పం అందజేస్తున్న శాంతినగర్ ఎస్‌ఐ నరేష్

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

గట్టు: రోడ్డు భద్రత నియమాలను పాటించి, ప్రమాదాలను నివారిద్దామని ఎస్‌ఐ నందీకర్ కోరారు. మంగళవారం రాత్రి బల్గెరలో హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనదారులకు ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది గులాబీలు అందించి అభినందించారు.

భీమరాయుడికి అభిషేకం



అయిజ: మండల కేంద్రంలోని కోట్లవీధిలో మంగళవారం భీమరాయుడి స్వామికి వేద పండితులు అభిషేకం చేశారు. అనంతరం గణపతి హోమం నిర్వహించారు. భక్తులు ఆకుపూజ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. స్వామివారి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

కొనసాగుతున్న ప్రత్యేక పూజలు



అయిజ: మండలంలోని చిన్న తాండ్రపాడులోని రాములవారి ఆలయంపై శిఖరం నిర్మించిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సంకల్పం, కలశపూజ, అగ్ని పూజ, గణపతి హోమం, నవగ్రహ హోమం, వాస్తు హోమం, సుదర్శన హోమం, పురుష సూక్త హోమం, విష్ణు సూక్త హోమం, శ్రీ సూక్తహోమం, రామ, లక్ష్మణ, సీత హోమాలు, పవమాన హోమం, బలి పూర్ణాహుతి, కుంభాభిషేకం, అలంకార్చన, నైవేద్యం, మంగళ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం



మానవపాడు: మండలంలోని బోరవెల్లిలో మంగళవారం చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు బంధువులు, కుటుంబసభ్యులు స్వామివారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు సీతారాములు, మద్దిలేటి, వెంకటస్వామి, కుర్వ నరసింహులు, మద్దిలేటి పాల్గొన్నారు.

వేడుకగా నందికోళ్ల సేవ

కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాల శివారులో సుందరగిరి గుట్టపై వెలిసిన పరమేశ్వస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం రాత్రి ఆలయ నిర్వాహకులు, అర్చకులు భక్తులతో కలిసి నందికోళ్ల సేవ నిర్వహించారు. నందికోళ్ల సేవలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి భక్తిని చాటుకున్నారు. జాతరలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

అయిజ: మున్సిపాలిటీలోని అన్ని కాలనీల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా పారిశుద్ధ్యం లోపించిన పరిసర ప్రాంతాలను గమనించి వాటిని పరిశుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో తప్పకుండా పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని, రోడ్లను శుభ్రంగా ఊడ్చాలని, మురుగు కాల్వల్లో ఎప్పటికప్పుడు మురుగును తొలగించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అపరిశుభ్రంగా ఉన్న పరిసర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న

విద్యతోనే బంగారు భవిష్యత్



అలూరు ఉన్నత పాఠశాలలో ప్రశ్నా పత్రాల కిట్టును అందజేస్తున్న ఎంపీపీ విజయ్‌కుమార్

గట్టు: విద్యతోనే బంగారు భవిష్యత్‌కు పునాదులు పడతాయని, పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను చేరేందుకు కృషి చేయాలని ఎంపీపీ విజయ్‌కుమార్ కోరారు. మంగళవారం ఆలూరు ఉన్నత పాఠశాలలో ఎంపీపీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ముఖాముఖి ని ర్వహించారు. ఎంపీపీ విజయ్‌కుమార్ ప్రభుత్వ పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి విద్యార్థికి చదువు చాలా ముఖ్యమని, పదో తరగతి చదువుకుంటున్న ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉత్తీర్ణత సాధించాలన్నారు. గట్టు మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యచరణ ప్రణాళికను అమలు చేయనున్నట్లు తెలిపారు. పరీక్షా పత్రాల కిట్టును ఎంపీపీ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు అందజేశారు. బస్వాపురం, తుమ్మలచెరువు విద్యార్థుల కోసం రెండు సైకిళ్లను ఇవ్వడానికి హామీ ఇచ్చారు. ఎంవీఎఫ్ జాతీయ కోఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు సహకారం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ కొండారెడ్డి, ఎంపీటీసీ ఆనంద్‌గౌడు, ఐసీపీఎస్ అధికారిణి లక్ష్మీ, ఎంవీఎఫ్ ప్రతినిధి సాయికుమార్, ఉప సర్పంచు నర్సన్‌గౌడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు,

పేదలకు మెరుగైన వైద్యం

గద్వాల రూరల్: పేదలకు మెరుగైన చికిత్స అందించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన నివాసంలో గట్టు మండలం ఇందువాసికి చెందిన శారదమ్మకు మెరుగైన చికిత్స కోసం రూ.1.50లక్షల ఎల్‌ఓసీ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గద్దం కృష్ణారెడ్డి, విష్ణు, తిక్కన్న, శ్రీనివాస్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ధరూరు: మండలంలోని అల్వలపాడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బిజ్వారం నర్సిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు గద్వాల ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, గద్దం కృష్ణారెడ్డి ఉన్నారు.

సుభాష్ చంద్రబోస్ పాత్ర మరువలేనిది



ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలలో సుభాష్ చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గద్వాల అర్బన్: స్వాతంత్ర్య ఉద్యమంలో సుభాష్ చంద్రబోస్ పాత్ర మరువలేనిదని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ డీగ్రీ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బ్రిటిష్ వారి నుంచి దేశాన్ని రక్షించడం కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీపతి నాయుడు, కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ లవీన మంజులత, అధ్యాపకులు ఉన్నారు.

ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ మాట్లాడారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ప్రధానోపాధ్యాయురాలు హేమలత, ఆదర్శ విద్యార్థుల సంఘం నాయకులు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆదర్శ విద్యార్థుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు

గట్టు: మండల కేంద్రంలో సర్పంచు ధనలక్ష్మి ఆధ్వర్యంలో నేతాజీ జయంతి నిర్వహించారు. నేతాజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు సత్యనారాయణ, వార్డు సభ్యుడు రమేష్, రిటైర్డ్ కండక్టర్ భరత్‌కుమార్, కాంట్రాక్టర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రికార్డులు పక్కాగా ఉండాలి

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఆరోగ్య ఉపకేంద్రంలో రికార్డులు పక్కాగా ఉండాలని సీహెచ్ వైద్యులు అబ్దుల్లా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో ఆయన బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వాహణలో పలు విషయాలను పరిశీలించి ఎంఎల్‌హెచ్‌పీ సంధ్యను ఆరా తీశారు. రికార్డులలో ఆశా కార్యకర్తలు హాజరు శాతం లేదని, నమోదు తారుమారుగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రిజిస్టర్ పక్కగా ఉండాలన్నారు. సరైన సమయంలో ఆశాలు ఆరోగ్య ఉప కేంద్రంలో ఉండాలని, ప్రతినెల 10లోపు బీపీ, షుగర్ పరీక్షలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రాజు, కో ఆర్డినేటర్ శ్యాంసుందర్, ఏఎన్ఎం వినోదిని, ఆశాలు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రధానోపాధ్యాయుడి సేవలు మరువలేనివి

శాంతినగర్: జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహ సేవలు మరువలేనివని నూతన ప్రధానోపాధ్యాయులు శ్యామ్యుల్ అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహ ఇటీవల రామాపురం పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు (ఎంఈఓ) నరసింహను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. నూతన ప్రధానోపాధ్యాయులు శ్యామ్యుల్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి నరసింహ ఎంతో కృషి చేశారన్నారు. నరసింహ మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు చక్కటి ప్రణాళికతో చదివి క్రమశిక్షణతో ఇష్టంగా చదివి తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ, ఉపాధ్యాయులు నాగశేషన్, సురేష్‌కుమార్, అజయకుమారి, జనార్ధన్, దావీదు, శేషమ్మ, అబ్దుల్ జావీద్, చెన్నారెడ్డి, రూపాబాయి, కల్యాణి, నాగజ్యోతి, సరిత, బాబు, ఆంజనేయులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయుడు నరసింహను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అధిష్టానం ఆదేశిస్తే ఎంపీగా పోటీ చేస్తా

ఎర్రవల్లిచౌరస్తా: కాంగ్రెస్ అధిష్టానం ఆదేశిస్తే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని మాజీ ఎంపీ మందా జగన్నాథం అన్నారు. మంగళవారం ఎర్రవల్లి మండలంలోని కొండేరులోని ఆయన నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. అదిష్టానం కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించినప్పుడే తనకు ఎంపీ టికెట్‌పై పూర్తి హామీ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి కనీసం 100 రోజులు కాకముందే ఎన్నికల హామీలపై బీఆర్ఎస్ నాయకులు హేళన చేసి మాట్లాడటం సరికాదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఇప్పటికే రెండింటిని నెరవేర్చి.. మరో నాల్గింటిని నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాళేశ్వరం పేరుతో తెలంగాణ సంపదను పూర్తిగా అప్పుల పాలు చేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక సీట్లను కైవ సం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి, మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, శేషన్‌గౌడ్, యోహాన్, వెంకటన్న, రాధ, బజారి ఉన్నారు.



కొండేరులో మాట్లాడుతున్న మందా జగన్నాథం